క్లుప్తంగా

ఆటో డ్రైవర్ కుటుంబానికి సాయం



ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

రాజానగరం: దివాన్‌చెరువులో గురువారం గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఆటో డ్రైవర్ దొడ్డి శివప్రసాద్ కుటుంబానికి యూనియన్ పరంగా దహన సంస్కారాల నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. యూనియన్ ప్రతినిధులు దాసరి శ్రీనివాసరావు, వంకా మల్లిబాబులు ఆ కుటుంబ సభ్యులను కలుసుకుని, పరామర్శించి, ఈ సాయాన్ని అందించారు. సంఘ పరంగా మరికొంత ఆర్థిక సాయాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మృతునికి వృద్ధురాలైన తల్లి, భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇష్టపడి చదివేలా బోధన సాగాలి

రంగంపేట: పిల్లలు ఇష్టపడి చదివేలా విద్యా బోధన సాగాలని మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ వి.పార్థసారథి సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి మూడో రోజు కార్యక్రమంలో భాగంగా వారు అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఆటపాటలు, అభినయ గేయాలతో పిల్లలు ఉత్తేజపడేలా బోధన చేయాలన్నారు. క్రీడలు, క్విజ్ పోటీల ద్వారా బాల్యం నుంచి పోటీతత్వం పెంపొందించడానికి కృషి చేయాలని, శిక్షణలో నేర్చుకున్న పలు ఆటపాటలు పాఠశాల క్రీడా మైదానాల్లో ప్రయోగాత్మకంగా విద్యార్థులతో చేయించాలని వారు సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో పలు ఆటలను డీఆర్పీలు ఎన్‌వీ రమణాంజలి, వి.త్రిమూర్తిరాజు ఆడించారు. ఈ సందర్భంగా హైస్కూల్ పీడీ శైల శారీరక, మానసిక వికాసానికి ఉపయోగపడే యోగాసనాలు వివరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతానగరం: సీతానగరం హెడ్ క్వార్టర్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం తెలిపారు. ఈ మరమ్మతులతో రఘుదేవపురం, రాపాక గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజానగరం: దివాన్‌చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. దీనివల్ల పాలచర్లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ వివరించారు.

వడిశలేరులో దివ్యాంగుల గుర్తింపు

రంగంపేట: వడిశలేరు గ్రామంలో 13 మంది దివ్యాంగులను గుర్తించినట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది మడికి రాంబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పెద్దాపురం కోర్టు 7వ జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి. చంద్రమౌళేశ్వరి ఆదేశాలతో బాల్య వివాహాలపై అవగాహన, దివ్యాంగుల యోగక్షేమాలపై ఇంటింటా సర్వే వడిశలేరులో జరుగుతుందన్నారు. న్యాయశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్ఎమ్, వైద్యాధికారులు తదితర 14 మంది సభ్యులతో టీమ్ సంయుక్తంగా సర్వే నిర్వహించామన్నారు. అదేవిధంగా బాల్య వివాహాలు జరగకుండా ఉండేలా, వాటి వల్ల కలిగే అనర్థాలు, శిక్షల గురించి తెలిపారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం సర్వే రిపోర్టు కోర్టుకు సమర్పిస్తామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి, న్యాయవాది మడికి రాంబాబు, పీఎల్‌వీలు నూతలపాటి అప్పలకొండ, డి. విజయ, ఎంపీహెచ్ఈఓ పి.ప్రసాద్, ఎంపీహెచ్ఏ జి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పల్లకడియం నుంచి రంగంపేట మండలం ముకుందవరం వరకూ నిర్మించిన గ్రావెల్ రోడ్డును ఇంజినీరింగ్ అధికారులు గురువారం పరిశీలించారు. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేసిన పనులకు కొలతలు తీసి, నాణ్యతను పరిశీలించారు. డీఈ ఎస్.దుర్గాప్రసాద్, ఏఈ సంపత్‌కుమార్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టారని ఫిర్యాదు

సీతానగరం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వారి కుటుంబ సభ్యులతో కలసి మహా కుంభమేళా పుణ్యస్నానాల ఫొటోలను మార్ఫింగ్ చేసి, సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు పెట్టారని సీతానగరానికి చెందిన జనసేన నాయకుడు మట్ట వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. ఐడీ ప్రూఫ్‌లతో ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అల్పాహారం... అదే కష్టం

- ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఇబ్బంది
- పైసా కూడా విదల్చని ప్రభుత్వం
- చదివి నీరసించిపోతున్న విద్యార్థులు

నియోజకవర్గంలో ఇలా..

మండలం	ఉన్నత పాఠశాలలు	పది విద్యార్థులు
అనపర్తి	8	831
బిక్కవోలు	8	607
పెదపూడి	14	785
రంగంపేట	9	573
	39	2,796



విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ

బిక్కవోలు: చదువు ఎంత ముఖ్యమో... విద్యార్థుల ఆరోగ్యం కూడా అదే అవసరం. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నా వారికి అల్పాహారం అందించపోవడంతో నీరసించిపోతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఉదయం 8 గంటల నుంచే కొన్ని తరగతులు ప్రారంభించి, సాయంత్రం 6 గంటల వరకూ తరగతిలో ఉండి చదువుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం కనీసం స్నాక్స్ ఇవ్వకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. అల్పాహార ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఎలాంటి నిధులూ కేటాయించకపోవడంతో ఇబ్బంది పడుతూనే చదువుకుంటున్నారు. అనపర్తి నియోజకవర్గంలో 39 ఉన్నత పాఠశాలల్లో ఈ ఏడాది 2,796 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. వచ్చే నెల 17 నుంచి ప్రారంభించనున్న పదో తరగతిలో విద్యార్థులు ఎలాగైనా నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా అదే స్థాయిలో ఉదయం 8 గంటల నుంచి, సాయంత్రం 6 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

దాతల కోసం ఎదురుచూపులు

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో పౌష్టికాహారాన్ని అందించేందుకు గ్రామాల్లోని దాతలు స్వచ్ఛంద సంస్థలను ఆశ్రయిస్తున్నారు. గతంలో దాతలు ముందుకురాని చోట్ల ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులే కొంత సొమ్ము వేసుకుని విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేశారు. కొన్ని పాఠశాలలకు మానవతా సంస్థ ఆధ్వర్యంలో దాతలు అల్పాహారాన్ని ఇస్తున్నారు. ఒక్కో పాఠశాలకు సుమారు రోజుకు రూ.500 నుంచి రూ.1500 వరకూ ఖర్చవుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంతో ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. లేదంటే కనీసం దాతలైనా రోజుకొకరు చొప్పున పరీక్షలు అయ్యేంత వరకూ సాయం చేయాలని కోరుతున్నారు. విద్యార్థులకు పులిహోర, ఉప్మా, ఉడకబెట్టిన శెనగలు, అరటిపండ్లు, వేరుశెనగ ఉండలు, సమోసాలు, బిస్కెట్లు తదితర తినుబండారాలు అల్పాహారంగా అందజేయవచ్చు. ఇలాంటి పోషకాహారం ద్వారా విద్యార్థులకు శక్తి పెరిగి చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుంది.

నీరసంగా ఉంటోంది..



పదో తరగతి ప్రత్యేక తరగతుల్లో ఎక్కువ సమయం పాఠశాల ఆవరణలో ఉంటున్నాం. అల్పాహారం లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంటుంది. అల్పాహారం అందిస్తే బాగుంటుంది. లేకుంటే నీరసం వస్తోంది.

–గొర్రిపోటి ప్రియదర్శిని, విద్యార్థి, పందలపాక

దాతలు చేయూతనందిస్తే..



ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందజేసేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కావడం లేదు. దాతలు స్పందించి చేయూతనందిస్తే అల్పాహారం అందించవచ్చు. తద్వారా విద్యార్థులు చదువుపై దృష్టిసారించే అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి సహకారం అందించాలి. ఇప్పటికే కొన్నిచోట్ల ఉపాధ్యాయులు అల్పాహారానికి సాయం అందజేస్తున్నారు.

–చిర్ల శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం, పందలపాక ఉన్నత పాఠశాల

సమర్థవంతంగా రీ సర్వే చేయండి



జి.దొంతమూరులో రీ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రంగంపేట: భూముల సమగ్ర రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామంలో భూముల రీ సర్వేను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే సందర్భంగా భూముల యజమానులను భాగస్వామ్యం చేయడమే కాకుండా సరిహద్దు భూముల వ్యక్తులు కూడా తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రీ సర్వే చేసిన వాటిపై ఏదైనా అభ్యంతరం ఉంటే తిరిగి మరలా రీ సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. అడంగల్, ఆర్ఓఆర్ పట్టాలను నిశితంగా పరిశీలించి సర్వే చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో గ్రామ స్థాయి అధికారుల సిబ్బంది పనితీరు జవాబుదారీతనం ఉండేలా మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉద్దేశ పూర్వకంగా రికార్డులు ట్యాంపరింగ్ చేసినా, తప్పుగా నమోదు చేసినా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, తహసీల్దార్ కోసు అనసూయ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ హేమసుందర్, మండల సర్వేయర్ కె.కుమారి, ఆర్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పెదపూడిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీసత్యసాయిబాబా సేవా సమితి కాకినాడ జిల్లా ప్రతినిధులు అన్నారు. పెదపూడిలో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే కంప్యూటర్ ద్వారా చత్వార, తలపోటు పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. కంట్లో శుక్లాలు ఉన్నవారికి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు. శిబిరంలో 126 మందికి వైద్య పరీక్షలు చేయగా, ఇందులో 18 మందికి ఆపరేషన్లు, 44 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించారు. అలాగే ప్రతి నెలా మూడో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ ఆరోగ్య కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు శిబిరం జరుగుతుందన్నారు. కాకినాడ ట్రినిటీ మల్టీ స్పెషలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో నల్లమిల్లి బుచ్చిరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. క్యాన్సర్‌కు సంబంధించిన అన్ని పరీక్షలు ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి



మహేంద్రవాడలో సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



రంగంపేటలో దత్త సాయిబాబా

పెదపూడి: గ్రామ దేవతల ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో బొద్రుపాలెం ప్రాంతానికి చెందిన సబ్బెళ్ల వారి సత్తెమ్మ తల్లి 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం గ్రామాల్లో దేవతలకు పూజలు చేయడంతో ఆ గ్రామాలు సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉంటాయన్నారు. అనంతరం గ్రామస్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులతో కొంతసేపు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

రంగంపేట: పెదరాయవరం గ్రామంలో షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రంగంపేట దత్తసాయి ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శిగా వెంకట్రాజు



వలవల వెంకట్రాజు

సీతానగరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శిగా వలవల వెంకట్రాజు (తోటలో రాజు) ఎంపికైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. రాజానగరం నియోజకవర్గం నుంచి సీతానగరానికి చెందిన వలవల వెంకట్రాజు ఎంపిక పట్ల మండల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, పార్టీలో పదవి పొందడానికి తనను సహకరించిన పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల పార్టీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంకట్రాజు ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు

మొక్కలు నాటేందుకు చర్యలు



కాటవరం రోడ్డు వద్ద ఉంచిన మొక్కలు

సీతానగరం: కాతేరు– సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు మధ్యలో మొక్కలు నాటడానికి కాటవరం సేవా సమితి ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. కాటవరం బీసీ కాలనీ నుంచి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు ఉంచారు. అయితే ఆ మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. మొక్క ఒకటి రూ 1,500 వరకూ ఉంటుందని, ఇవి సీజనల్ మొక్కలని, తిరిగి చిగురిస్తాయని సేవా సమితి వారు తెలిపారు. కాటవరం నుంచి కాతేరు వరకు తారురోడ్డు డివైడర్ మధ్యలో ఈ మొక్కలు పెంచుతామని, వీటికి ట్రిమ్మింగ్ చేయవచ్చన్నారు. అలాగే వృక్షాలుగా పెరిగే మొక్కలను రోడ్డుకు ఇరువైపులా పెంచుతామని వారు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి, ఇదే విధంగా మొక్కలు పెంచడానికి ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమావేశం



సమావేశంలో ఆర్డీఓ కృష్ణ నాయక్, నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్

సీతానగరం: రాజమహేంద్రవరం ఆర్డీఓ కార్యాలయంలో మహా శివరాత్రి సందర్భంగా పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వంగలపూడి రేవు నుంచి వెళ్లే భక్తులకు కల్పించే సదుపాయాలపై ఆర్డీఓ కృష్ణ నాయక్, నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్‌లు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంగలపూడి రేవులో కల్పించే సదుపాయాలపై ఎంపీడీఓ ఎమ్.భారతి, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్, ఆర్అండ్‌బీ, ఎక్సైజ్, పోలీస్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారని, వారి పరిధిలో చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు ఇచ్చారని తహసీల్దార్ తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

రంగంపేట: సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సుధ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో మర్రిపూడి గ్రామంలో సారా తయారీ, విక్రయాలు జరుపుతున్న దంగేటి దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి, అతని నుంచి 800 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊట, అల్యూమినియం పాత్రలు, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్లపు ఊటను, అల్యూమినియం పాత్రలు, డ్రమ్ములను ధ్వంసం చేసి, దంగేటి దుర్గా ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఆమె తెలిపారు.

రెడ్‌క్రాస్ గురించి అవగాహన



పందలపాకలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి మహాలక్ష్మి

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఇండియన్ రెడ్‌క్రాస్ ట్రైనింగ్ ప్రోగామ్ నిర్వహించారు. గురువారం పాఠశాల వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ ప్రతినిధి మహాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు రెడ్‌క్రాస్ సంస్థ గురించి వివరించారు. సంస్థ ప్రజలకు చేస్తున్న సేవలను తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఈ సేవలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు రక్తదానం, ప్రథమ చికిత్స సేవాభావాల గురించి మరింత అవగాహన కల్పించారు. కార్యక్రమంలోని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి పాల్గొన్నారు.

బాబాను తాకిన సూర్య కిరణాలు

బిక్కవోలు: బలభద్రపురం ఆంధ్రా షిర్డీ సాయి మందిరంలో కొలువైన బాబా విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకాయి. గురువారం ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ బాబా విగ్రహంపై ఏటా సూర్యకిరణాలు తాకుతాయన్నారు. బాబా తల నుంచి నుదురు, కంఠం, చాతీ, ఉదరం నుంచి పాదాల వరకు ఈ కిరణాలు చేరుతాయన్నారు. వచ్చిన భక్తులకు అన్నసమారధన ఏర్పాటు చేశారు.

బలభద్రపురంలో బాబా ముఖాన్ని తాకిన సూర్యకిరణాలు →



విద్యావంతుల సమస్యలపై గళం విప్పుతా..

మధురపూడి: పట్టభద్రులు, విద్యావంతుల సమస్యలపై చట్టసభల్లో గళం విప్పడానికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆమ్‌ఆద్మీ పార్టీ బలపర్చిన అభ్యర్థి కాశ్లూరి కృష్ణమోహన్ అన్నారు. గురువారం కోరుకొండ దేవుని కోనేరు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ ప్రతి సంవత్సరం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు భర్తీ చేస్తానని, నిరుద్యోగ భృతిని చెల్లిస్తానని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాగులపాటి బాలాజీ, చొంగా రామకృష్ణ, సూరిశెట్టి కుటుంబరావు, కొత్తపల్లి సాయికుమార్, పెంటగల్లు మణికుమార్, కొత్తపల్లి శ్రీను పాల్గొన్నారు.

జోరుగా సభ్యత్వాల నమోదు

సీతానగరం: మండలంలోని సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యత్వాల నమోదు జోరుగా సాగుతున్నాయి. గురువారం సమరసతా సేవా ఫౌండేషన్ గోకవరం, కోరుకొండ, సీతానగరం ధర్మ ప్రచారక్ ఎ.మల్లేశ్వరరావు, మండల మహిళా కన్వీనర్ కె అభిలాష ఆధ్వర్యంలో సీతానగరం, రఘుదేవపురంలలో సభ్యత్వాల నమోదు నిర్వహించారు. ఈ నమోదుకు రూ.వంద చెల్లించి, సభ్యత్వాలు పొందుతున్నారు. సమరసతా మండల కన్వీనర్ బూరుగుపల్లి బంగారయ్య, సహ కన్వీనర్ గుల్లి గోపాలకృష్ణ, గ్రామ కన్వీనర్ గుల్లి చిన్నా పాల్గొన్నారు.

సమన్వయంతో నారసింహుని ఉత్సవాలు

మధురపూడి: వచ్చే నెల 9న ప్రారంభం కానున్న కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను అన్ని శాఖలు సమన్వయంతో నిర్వహించాలని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ విజ్ఞప్తి చేశారు. గురువారం కోరుకొండ స్వామివారి కల్యాణ మండపంలో అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమన్వయ సమావేశంలో పోలీసు, దేవదాయ- ధర్మదాయ, వైద్య, విద్యుత్, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, రెవెన్యూ తదితర శాఖలు, స్థానికుల అభిప్రాయాలు, సూచనలను సేకరించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీఓ నాయక్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భక్తులకు రక్షిత నీరు, నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, కొండపై, కింద పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అన్ని శాఖల అధికారుల ఫోన్ నంబర్లు అక్కడుండాలని, తద్వారా భక్తులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కారం చేయగలుగుతామన్నారు. మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థానంలో శాశ్వత ప్రాతిపదికన మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపడదామన్నారు. ప్రభుత్వ వైద్యులు కొండపైన, కింద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా డ్రోన్ సర్వేతో పాటు, మొబైల్ పర్యవేక్షణ నిర్వహిస్తామన్నారు. రథోత్సవం సందర్భంగా రథాన్ని లాగుతున్న వారితో కూడిన బాక్సు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త రంగరాజ బట్టర్, అన్నవరం దేవస్థానం ఏఈ సీహెచ్ రామ్మోహనరావు, రామకృష్ణ, సూపరింటెండెంట్ బలుపు వాసు, ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, తహసీల్దార్ సుస్వాగతం, కోరుకొండ సీఐ వై.సత్యకిశోర్, ఎస్సై శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో అంగన్‌వాడీల పాత్ర కీలకం



ఊలపల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ జెస్సీ ఫోరెన్స్

బిక్కవోలు: విద్యా వ్యవస్థలో అంగన్‌వాడీ కార్యకర్తలూ ఓ భాగమేనని డీఈఓ రంగంపేట ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీ ఫోరెన్స్ అన్నారు. గురువారం ఊలపల్లి ఉన్నత పాఠశాల వద్ద అంగన్‌వాడీ సిబ్బందికి జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలోని ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీలో 120 రోజుల సర్టిఫికెట్ శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎంఈఓ-2 కె.పూర్ణచంద్రరావు, పాఠశాల హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఐసీడీఎస్ ఊలపల్లి సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి, బిక్కవోలు సూపర్‌వైజర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని తిరస్కరించండి

రాజానగరం: ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను మోసం చేసి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలంటే గ్రాడ్యుయేట్ ఓటర్లంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని తిరస్కరించాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అడబాల జగదీష్ అన్నారు. నిరుద్యోగ భృతి పేరుతో కూడా మోసం చేశారని గుర్తు చేశారు.

శ్రీషిర్డీసాయి మందిరంలో అన్నప్రసాద వితరణ

కడియం: దుళ్లలో శ్రీషిర్డీసాయి మందిరంలో దాతల సహకారంతో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర కమిటీ పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యూనియన్ బ్యాంకు సేవలు విస్తృతం



బ్యాంకులో ఆధునీకరించిన బ్యాంక్ ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ షాలినీ

మధురపూడి: యూనియన్ బ్యాంకు సేవలను ఖాతాదారులు, వినియోగదారులకు విస్తృతం చేయనున్నట్టు బ్యాంకు జోనల్ మేనేజర్ షాలినీ అన్నారు. గురువారం పశ్చిమగానుగూడెంలో యూనియన్ బ్యాంకు వార్షికోత్సవం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన షాలినీ మాట్లాడుతూ బ్యాంకులో ఏటీఎంను ఆవిష్కరించి, సాంకేతికపరమైన హంగులతో ఆధునీకరించిన బ్యాంకును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిక్స్‌డ్ ఖాతాదారులతో పాటు రెగ్యులర్ ఖాతాదారులు, రైతులు, కార్మికులు, మహిళలకు మరిన్ని సేవలందించనున్నట్టు తెలిపారు. రీజినల్ మేనేజర్ విశ్వేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ పాల్గొన్నారు.